నూతన ఏడాదిలో... కొత్త సారథులు..!



- జేడీఎస్ కొత్త అధ్యక్షుడిగా నిఖిల్
- డీకే కాదనుకుంటే కాంగ్రెస్ రేసులో పలువురు
- బీజేపీ అధ్యక్ష హోదా కోసం శోభా, బొమ్మై

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది వచ్చేసింది. రెండేళ్ల కాలంలో కీలకమైన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల తరుణంలో అధిష్ఠానం ఆచితూచి పార్టీ అధ్యక్షులను నియమించింది. మరో మూడేళ్లపాటు కీలకమైన ఎన్నికలు లేని కారణంతోపాటు అధ్యక్షులుగా ఒక గడువు ముగించినవారిని మార్పు చేయాలనే ప్రస్తావనలు రాష్ట్రంలోని కీలకమైన మూడు రాజకీయ పార్టీలలోనూ కొనసాగుతోంది. దీన్నిబట్టి రాష్ట్రంలోని మూడు పార్టీలకు కొత్త అధ్యక్షులు ఎంపికయ్యే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయనే చర్చలు సాగుతున్నాయి.

నిఖిల్ పేరు ఖరారు



జేడీఎస్ పార్టీకి ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడి హోదాలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి వ్యవహరిస్తున్నారు. ఆయన కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నందున రాష్ట్ర పార్టీ వ్యవహారాలు చూసుకోవడం సాధ్యం కాదని పలు సందర్భాలలో కుమారస్వామి తెలిపారు. దీంతో కొత్త అధ్యక్షుడిని నియమించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ నిర్ణయించినట్లు తెలుస్తోంది. జేడీఎస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా దేవెగౌడ కుటుంబ సభ్యులే సుదీర్ఘకాలంగా కొనసాగారు. పదేళ్లకిందట ఏ కృష్ణప్ప అధ్యక్షుడిగా కొనసాగుతూ కన్నుమూయడంతో ఆ తర్వాత తాత్కాలికంగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టారు. కొన్నేళ్ల తర్వాత ఇబ్రహీంకు పార్టీ అధ్యక్ష పదవి అప్పగించారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల వేళ జేడీఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తాత్కాలికంగా కుమారస్వామి అధ్యక్షుడిని చేశారు. ప్రస్తుతం జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్న కుమారస్వామి రాజకీయ వారసుడు, పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడకు అత్యంత అభిమానమైన మనవడు నిఖిల్‌కుమార్‌ను అధ్యక్షుడిగా చేయాలని తీర్మానించినట్టు తెలుస్తోంది. ఇటీవల వరుసగా మూడు ఎన్నికల్లో ఓటమి చెందినా ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న నిఖిల్‌ను అధ్యక్షుడిని చేస్తే పార్టీ అభివృద్ధి సాధ్యమని కుమారస్వామి విశ్వసిస్తున్నారు. అయితే గతంలో లేని విధంగా నిఖిల్‌ను అధ్యక్షుడిని చేసి ముగ్గురు కార్యాధ్యక్ష పదవులను నియమించాలని భావిస్తున్నారు. వీరిలో ఎస్సీ లేదా ఎస్టీ ఒకటి, ఓబీసీ, మైనారిటీలలో ఒక్కొక్కరికి ఇవ్వదలిచారు. యువ విభాగం అధ్యక్షుడిగా శరణగౌడ కందుకూరును నియమించే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత ప్రక్రియ కొనసాగనుంది.

డీకే కాదనుకుంటే కాంగ్రెస్ రేసులో పలువురు



రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన పార్టీగా గుర్తింపు పొందిన కాంగ్రెస్ నాలుగేళ్లకిందట మనుగడ క్లిష్టంగా ఉన్న సమయంలో అధిష్ఠానం ఆచితూచి డీకే శివకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. పార్టీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ రెండు దశాబ్దాలకుపైగా పార్టీ ద్వారా భిన్నంగా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుల ప్రక్షాళనతో పాటు కార్యవర్గాన్ని తనకు అనుకూలంగా చేసుకున్నారు. మేకెదాటు ప్రాజెక్టుకోసం పాదయాత్ర, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర రాష్ట్రంలో కొనసాగిన విధానం దేశమంతటా చర్చనీయాంశమైంది. 2023 శాసనసభ ఎన్నికల్లో తిరుగులేని స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లోనూ అంతకుముందు ఒక స్థానానికే పరిమితంగా ఉండే పార్టీ ఏకంగా 9 స్థానాలకు పెరిగింది. ఇటీవల 3 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అన్నింటినీ కైవసం చేసుకోవడం ద్వారా డీకే శివకుమార్‌కు అధిష్ఠానం వద్ద మరింత పరపతి పెరిగింది. ప్రస్తుతం డీకే శివకుమార్ ఉపముఖ్యమంత్రిగా, బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రిగా, జలవనరులశాఖ మంత్రిగా కీలకమైన హోదాలలో ఉన్నారు. అదనంగా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మరో మూడేళ్లు ఎన్నికలు లేని కారణంగా మరొకరిని నియమించి పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అధ్యక్షస్థానం మార్పు అనివార్యమైతే మంత్రులు ఎంబీ పాటిల్, రాజణ్ణలు ప్రయత్నిస్తున్నవారిలో ఉన్నారు. మరో మంత్రి ఈశ్వర్ ఖండ్రె పేరు కూడా ప్రస్తావనలో ఉంది. ఎస్సీ, ఎస్టీ వర్గీయ ు ల క ు అధ్యక్ష పదవి ఇవ్వదలచుకుంటే గతంలో కేపీసీసీ సారథిగా కొనసాగిన పరమేశ్వర్‌కు మరోసారి అవకాశం లభించవచ్చునని తెలుస్తోంది. ఇక సతీశ్‌జార్కిహొళి పేరు కూడా ప్రస్తావనలో ఉంది. అయితే అధిష్ఠానం డీకే శివకుమార్‌తో చర్చించకుండా నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదు. రెండుసార్లు ఎంపీగా కొనసాగి ఇటీవలి ఎన్నికల్లో ఓటమి చెందిన తమ్ముడు డీకే సురేశ్‌కు పార్టీ పగ్గాలు దక్కేలా వ్యూహంలో ఉన్నట్టు తెలుస్తోంది. అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాల్సి ఉంది.



బీజేపీ పీఠం రేసులో శోభ, బొమ్మై



క్రమశిక్షణకు మారుపేరుగాను, అధిష్ఠానంలో శక్తివంతమైన నేతలు కీలకస్థానాలలో ఉన్న రాష్ట్ర బీజేపీలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎవరికివారుగా నిరసనలు తెలుపుతున్నారు. పార్టీ నిర్ణయాలు వేర్వేరుగా పాటిస్తున్నారు. ఈ విధానం మరింతకాలం కొనసాగించరాదని అధిష్ఠానం ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీగడువు ముగుస్తున్న తరుణంలో కొత్తవారిని నియమించాలని పార్టీ ఢిల్లీ పెద్దలు కసరత్తు ప్రారంభించారు. ఈలోగానే మరో పర్యాయం విస్తరింపచేసుకోవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పలుమార్లు ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను విజయేంద్ర కలసివచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పార్టీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలను కలిశారు. అయితే విజయేంద్ర మార్పు మినహా మరో అంశంపై రాజీ లేదని రెబెల్ టీమ్‌గా మారిన ఎమ్మెల్యేలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళి, కేంద్రమాజీ మంత్రి సిద్దేశ్వర్, రాష్ట్రమాజీ మంత్రి అరవింద లింబావళి సహా పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవలే ఢిల్లీలో అధిష్ఠానం వద్ద పంచాయితీ కూడా జరిగింది. వీటన్నింటినీ సర్దుబాటు చేయాలంటే అధ్యక్షుడి మార్పు అనివార్యమనే ఆలోచనలో అధిష్ఠానం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్న శోభాకరంద్లాజె, మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ్ బొమ్మైల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. జాతీయ అధ్యక్షుడు నడ్డా మార్పు ఫిబ్రవరిలో కొనసాగనుండగా ఈలోగానే రాష్ట్ర అధ్యక్షుడి మార్పు ఉంటుందనిపిస్తోంది. గతంలో అధ్యక్షుడిగా ప్రతిపక్షనేతగా ముఖ్యమంత్రిగా మూడుసార్లు కొనసాగిన యడియూరప్పను వ్యతిరేకించేవారు ఒకరిద్దరు మాత్రమే ఉన్నా విజయేంద్రను మాత్రం ఏకంగా ఒక వర్గం అభ్యంతరం తెలుపుతోంది. ఇటీవలే భిన్నస్వరాలు తీవ్రమైన తరుణంలో యడియూరప్ప నేరుగా బసవరాజ్ బొమ్మై ఇంటికి వెళ్లి సుదీర్ఘంగా చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడి మార్పు అనివార్యమనే సంకేతాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఇలా మూడు పార్టీలకు కొత్త అధ్యక్షులు త్వరలోనే తెరపైకి వచ్చే అవకాశం ఉంది.


జాతీయ ఓటరు దినోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న ఎన్నికల అధికారులు

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్‌ను రాష్ట్ర ఎన్నికల అధికారులు సాదరంగా ఆహ్వానించారు. బుధవారం ఎన్నికల అధికారులు రాజభవన్‌కు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంలోనే ఈనెల 25న జరిపే జాతీయ ఓటరు దినోత్సవానికి ముఖ్యులుగా హాజరుకావాలని అధికారులు గవర్నర్‌ను కోరారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి మనోజ్‌కుమార్ మీనా, అదనపు ముఖ్య అధికారి వెంకటేష్ కుమార్, స్వీప్ ముఖ్యులు పీఎస్ వస్త్రద్ గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మలె మహదేశ్వర కొండపై మంత్రివర్గ భేటీ



మలెమహదేశ్వర కొండపై ఆలయం

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ధార్మికకేంద్రం చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలోని మలెమహదేశ్వర కొండపై కొత్త ఏడాది మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించారు. ఈనెల 9 లేదా 16వ తేదీల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన చామరాజనగర జిల్లాలో కేబినెట్ భేటీ ద్వారా జిల్లాకు సంబంధించిన సమస్యలపై చర్చలు జరిపే అవకాశం ఉంది. మలెమహదేశ్వర ఆలయ అభివృద్ధి ప్రాధికార కేబినెట్ భేటీకి తగిన ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. రెండోవారం లేదా మూడోవారంలో కేబినెట్ సమావేశం జరపాలనేది ఇంకా ఖరారు కాలేదు. చామరాజనగర జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటిస్తే పదవిని కోల్పోతారనే సెంటిమెంట్ కొన్నేళ్లుగా కొనసాగింది. గతంలో కొందరు సీఎంలు అటువైపు వెళ్లేందుకు ఉత్సాహం చూపలేదు. అయితే సీఎం సిద్దరామయ్య ఇటువంటి మూఢనమ్మకాలకు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం రెండోసారి పాలన సాగిస్తున్న తరుణంలోనూ పలుమార్లు చామరాజనగర జిల్లాలో పర్యటించారు. సాధారణంగా కేబినెట్ సమావేశం అంటే బెంగళూరు విధానసౌధలో జరుపుతారు. కానీ ఇటీవలే కలబురగిలో కేబినెట్ భేటీ జరపగా తాజాగా చామరాజనగర జిల్లాలోనూ అదే విధానం కొనసాగించదలిచారు.

చిందేసిన యువత

- సగం రోజుకే రూ.308 కోట్ల మద్యం విక్రయాలు



ఎంజీ రోడ్డులో సందడి ఇలా...

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల ఉత్సాహం రాష్ట్రమంతటా సంబరంలా సాగింది. ప్రత్యేకించి బెంగళూరు, మంగళూరు, బెళగావితోపాటు పలు నగరాలలో యువత కేరింతలు కొట్టారు. బెంగళూరులో ఎంజీ రోడ్డు, బ్రిగేడ్‌రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, కోరమంగల, ఇందిరానగర్ ప్రాంతాలలో వేలాదిమంది మద్యంమత్తులో చిందులు వేశారు. రాత్రి 12 గంటల తర్వాత ఎంజీ రోడ్డులో యువత నడవలేక తూలారు. మహిళా పోలీసులు, వలంటీర్లు వందలాదిమందిని వాహనాల చెంతకు తరలించారు. చర్చ్‌స్ట్రీట్‌లో భారీగా జనం చేరడంతో కట్టడి చేసేందుకు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. కోరమంగలలో ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేరకు ఆమె తిరగబడ్డారు. స్థానికులు సదరు వ్యక్తిని చితకబాది పోలీసులకు అప్పగించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 12 గంటలకు రూ.308 కోట్ల విలువైన మద్యం వ్యాపారం జరిగినట్టు ఫెడరేషన్ ఆఫ్ వైన్‌మర్చంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గోవిందరాజహెగ్డే ప్రటించారు. రూ.250.25 కోట్ల విలువైన 4.83లక్షల బాక్సుల విస్కీ, రూ.57.75 కోట్ల విలువైన 2.92 లక్షల బాక్సుల బీర్ విక్రయించినట్లు ప్రకటించారు. కాగా ఎంజీరోడ్డు, బ్రిగేడ్‌రోడ్డు ప్రాంతాలలో 15 మెట్రిక్ టన్నుల చెత్త సేకరించినట్లు బీబీఎంపీ ప్రకటించింది.

ఆరుబయటే అంగన్‌వాడీ కార్యకర్త..!

- ఆరు నెలలుగా తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం
- గ్రామ మహిళకే కేటాయించాలని గ్రామస్థుల పట్టు

కంప్లి, జనవరి 1(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో ప్రాథమిక విద్యను అందించే అంగన్ వాడీ కార్యకర్తలు అధికారులు విధించే ఒత్తిళ్లను ఎదుర్కొని తమ విధులు నిర్వహిస్తుంటారు. కాస్తో కూస్తో వచ్చిన జీతాలకే జీవనాన్ని కొనసాగిస్తుంటారు. ప్రభుత్వాలు వారికి ఇప్పటివరకు పర్మనెంట్ చేయకుండానే విధులు చేయించుకుంటోంది. ఏ ఎన్నికలు వచ్చినా ఏ సమాచారం కావాలన్నా వీరిపైనే ఒత్తిడి తీసుకువచ్చి సేకరిస్తుంటాయి. ఇలాంటి తరుణంలో విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకా గొల్లరహట్టి గ్రామంలో శాంబక్క అనే అంగన్‌వాడీ కార్యకర్త ఆరు నెలలుగా ప్రతి నిత్యం ఉప్పరహట్టి నుంచి గొల్లరహట్టికు చేరుకుని తాళాలు వేసిన అంగన్‌వాడీ కేంద్రం ముందు నిల్చుని తరువాత ఇంటికి వెళుతోంది. గొల్లరహట్టి గ్రామ ప్రజలు తమ గ్రామంలో వుండే వారినే కార్యకర్తగా నియమించాలని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తాళాలు వేసి విధులకు హాజరుకాకుండా గ్రామస్థులు అడ్డుపడుతున్నారు. గ్రామంలో వుండే మహిళలకు ఉద్యోగం కల్పించాలని అప్పటి వరకు కేంద్రాన్ని తెరవమని గ్రామస్థులు చెబుతున్నారు. ఇలా చేయడంతో అంగన్‌వాడీ కార్యకర్త విధులకు హాజరుకాలేక ప్రతి రోజు కేంద్రం వద్దకు వచ్చి తిరిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అధికారులు చొరవ తీసుకోకపోతే అంగన్‌వాడీ కేంద్రం మూతపడేపరిస్థితి వుందని కార్యకర్త వాపోతోంది.




తాళం వేసిన అంగన్‌వాడీ కేంద్రం ముందు నిల్చున్న అంగన్‌వాడీ కార్యకర్త శాంబక్క



దిగొచ్చిన బియ్యం ధరలు..!

వినియోగదారులకు మేలు... రైతులకు ఇబ్బందులు

8



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.18	1,591.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,122	262
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,961	1,470
నీటి నిల్వ (టీఎంసీలు)	91.01	11.77

ఆలయాల్లో ప్రత్యేక పూజలు




అలంకరణలో ఎర్రితాత స్వామి, కనకదుర్గమ్మ

బళ్లారిరూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాలకు వెళ్లి భక్తులు ప్రత్యేక పూజలు చేసుకుని అందరికీ శుభాలు కలగాలని మొక్కుకున్నారు. చేళగుర్కి ఆలయంలో ఆంధ్ర కర్ణాటక నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బళ్లారి ఆరాధ్యదైవం కనకదుర్గమ్మ ఆలయంలో నగరంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని కొత్త సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

హంపికి భక్తుల తాకిడి



పూజలందుకుంటున్న విరూపాక్షేశ్వరుడు

బళ్లారి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల 2025 నూతన సంవత్సరం వేళ ప్రపంచ ప్రసిద్ధి చెందిన హంపిలో విరుపాక్షేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. బుధవారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి తుంగభద్ర నదిలో పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల సందడి తగ్గలేదు. దేవాలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇతర దేశాల నుంచి భక్తులతో పాటు స్వదేశీ భక్తులు కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. విరుపాక్షేశ్వర స్వామికి ఉదయం విశేషపూజలు చేశారు.

బళ్లారి మిల్క్ యూనియన్

ఎండీగా ప్రభు శంకర్



ప్రభుశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

బళ్లారి సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయచూరు, కొప్పళ, విజయనగరం జిల్లాల మిల్క్ యూనియన్ నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభు శంకర్ నియమితులయ్యారు. ఇక్కడ ఎండీగా పిర్యానాయక్ పనిచేశారు. ఇక్కడ ఎన్నికైన పాలమండలి లేకపోవడంతో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. కొన్ని పనులకు టెండర్లు పిలిచినా ఒత్తిడికి తలొగ్గకపోవడంతో ఆయనను బదిలీ చేసినట్లు చెబుతున్నారు. ఆయన స్థానంలో ప్రభుశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రాయచూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్ నగర్ కాలనీలోని ఒక ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యంతో పాటు జొన్నలు అక్రమంగా నిల్వ ఉంచారని వాటిని రేషన్ దుకాణాలకు చెందినదిగా కొంత మంది ఇచ్చిన సమాచారంతో పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. 38 బస్తాల బియ్యం, జొన్నలు పట్టుబడ్డాయి. ఇందుకు సంబంధించి నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో సివిల్ సప్లై అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దిగొచ్చిన బియ్యం ధరలు

- వినియోగదారులకు మేలు..
- రైతులకు ఇబ్బందులు

బళ్లారి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బియ్యం ధర దిగొచ్చింది. గత ఏడాది ఇదే సమయానికి క్వింటాల్ సోనామసూరి రూ.4,900 వరకూ ఉండేది. ప్రస్తుతం రూ.3.500 నుంచి 3,700 వరకు అమ్ముడు పోతున్నాయి. ఈ ఏడాది తుంగభద్ర జలాశయంలో రబీ పంట సాగుకు నీరు పుష్కలంగా ఉన్నాయి. రెండో పంట గ్యారెంటీ అనే నమ్మకం రైతుల్లో చిగురించింది. దీంతో బియ్యం రేటు ఈసారి బాగా తగ్గిందని రైస్ మిల్లర్లు అంటున్నారు. తుంగభద్ర జలాశయం కింద కర్ణాటక, ఆంధ్ర పరిధిలో 12 లక్షల హెక్టార్ల ఆయకట్టు భూమి ఉంది. అధికారుల లెక్కల ప్రకారం ఎక్కువ శాతం అంటే 8 లక్షల హెక్టార్ల వరకూ ఖరీఫ్‌లో వరి సాగు చేయగా, మిగిలిన 4 లక్షల హెక్టార్లలో ఇతర పంటలు సాగు చేశారు. ఈ ఏడాది నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో వరి పంటను విస్తారంగా సాగు చేశారు. ఎకరాకు సరాసరి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. దీనికి తోడు రెండో పంటకు అవసరం అనుకున్న జలాలు తుంగభద్ర డ్యాంలో ఉన్నాయి. ఇక రెండో పంట కూడా గ్యారెంటీ అని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

తగ్గిన డిమాండ్

పంట దిగుబడులు పుష్కలంగా ఉండటంతో డిమాండ్ తగ్గిందని మిల్లర్లు, వ్యాపారులు అంటున్నారు. గతేడాది తుంగభద్రలో రెండో పంట వేయలేదు. దీంతో క్వింటాల్ బియ్యం రూ.4,700 నుంచి 4,900 వరకూ పలికింది. ప్రస్తుతం సోనామసూరి బియ్యం క్వింటాల్ రూ.3,500 నుంచి 3,900 వరకూ ఉంది. అది కూడా నాణ్యమైన బియ్యమే. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాల్లో 580 వరకు రైస్ మిల్లులు ఉన్నాయి. తుంగభద్ర డ్యాం నీటితో పండించిన ధాన్యానికి డిమాండ్ ఎక్కువ. గతంలో ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి కూడా అయ్యేవి. ఈసారి ఎగుమతి కావడం లేదు. బియ్యం ధర లేకపోవడంతో ధాన్యం రేటు కూడా తగ్గిపోయింది. ఒక పక్క రైతులు దిగులు చెందుతుంటే మరోపక్క ఎంతో కొంత మేలు అని వినియోగదారులు అంటున్నారు.



రైస్ మిల్లుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యం ప్యాకెట్లు

రెండో పంట ఉండటం వల్లే..



ఈసారి తుంగభద్ర డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్నాయి. రబీ పంట గ్యారెంటీగా రైతులు వేస్తారు. ధాన్యం బాగా దిగుబడి బాగా ఉంది. దిగుబడి ఎక్కువ ఉండి. వాడకం తగ్గితే ఖచ్చితంగా రేటు తగ్గుతుంది. అందుకే బియ్యం రేటు గతంతో పోల్చితే ఈ ఏడాది బాగా తగ్గాయి. పంట బాగా పండడం, రేట్లు అదుపులో ఉండడం రెండూ మంచిదే.

- మధుసూదన్, శ్రీనివాస రైస్‌మిల్ యజమాని

ఘనంగా భీమాకోరేగావ్ విజయోత్సవం

బళ్లారి సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చలవాది మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని బి గోనాల్ 17వ వార్డులో భీమకోరేగావ్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భీమాకోరేగావ్ స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చలవాది మహాసభ జిల్లాఅధ్యక్షుడు సి.శివకుమార్ మాట్లాడుతూ జనవరి 1 ప్రపంచానికి నూతన సంవత్సర వేడుక అని, అణగారిన వర్గాల కోసం పోరాడిన మహాయోధుల ధీర దినమని అన్నారు. అంటరానితనం నిర్మూలనలో విజయం సాధించిన రోజు అని అన్నారు. అంబేడ్కర్ జీవితంలో ప్రధాన స్ఫూర్తిగా నిలిచిన ఈ రోజు మనందరికీ విజయదినం అన్నారు. కర్ణాటక దళిత రక్షణ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శంకర్ నందిహాల్ మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో ఆధిపత్యం చెలాయించిన బ్రిటీషు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహర్ వీర్ సిద్దనాక్ నేతృత్వంలో చర్యలు జరిపి అంటరానివారిపై అణచివేతకు ముగింపు పలుకుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంటరానితనం పట్ల ఆగ్రహించిన మహర్ తెగకు చెందిన 500మంది యువ యోధులు యుద్ధంలో శిక్షణ పొంది జనవరి 1818లో బ్రిటీషు కెప్టెన్ నందన్ నాయకత్వంలో భీమానది ఒడ్డున ఉన్నకోరేగావ్ అనే ప్రదేశంలో సుమారు 28,000 మంది సైనికులను కలిగి ఉన్న బ్రాహ్మణ పీష్వాలకు వ్యతిరేకంగా యుద్ధానికి నాయకత్వం వహించి 13 నుంచి 14వేల మందికిపైగా పీష్వాలను చంపి, పరిపాలనను స్వాధీనం చేసుకుని అంటరాని తనాన్ని అంతం చేశారన్నారు. కార్యక్రమంలో చలవాది మహాసభ ఉపాధ్యక్షుడు హనుమేశ్ కత్తిమణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దళిత రక్షణవేదిక లోకేష్ వెంకటేశ్, డి.రామకృష్ణ, మల్లికార్జున, గోనాల్, దళిత నాయకులు యల్లప్ప, మధురాజ్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దళిత సంఘం నాయకులు

ఒక్కటైన 14 జంటలు

కంప్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి గ్రామంలో మడివాళ మాచిదేవర జయంతిని పురస్కరించుకుని 14 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. మడివాళ జాగృతి వేదిక ట్రస్టు అధ్యక్షుడు ఆర్ మంజునాథ మాట్లాడుతూ మడివాళ సమాజంలో ఎంతోమంది పేద కుటుంబాలను దృష్టిలో వుంచుకుని ఆదిచుంచనగిరి మఠంలో నర్మిలానంద స్వామీజీ చేతుల మీదుగా సామూహిక వివాహాలు చేపట్టారన్నారు. జయంతోత్సవాన్ని పురస్కరించుకుని కూడా ప్రతియేటా మడివాళ మాచిదేవర సమాజం వారు సామూహిక వివాహాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఒక్కటైన జంటలు ఎన్ని కష్టాలు ఎదురైనా ఒడిదుడుకులను ఎదుర్కొని జీవనం సాగించాలన్నారు.



జంటలకు తాళిబొట్లు అందిస్తున్న సమాజం పదాధికారులు

కళాసంస్కృతికి ప్రతిరూపం జక్కణాచార్యుడు

రాయచూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భారతీయ కళాసంపదకు కళా వైభవానికి సంస్కృతి అమరశిల్పి జక్కణ్ణ ప్రతిరూపంగా నిలిచారని తహసీల్దార్ సురేశ్ వర్మా అన్నారు. నగరంలోని రంగమందిరంలో బుధవారం జిల్లా పంచాయతీ, కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో అమరశిల్పి జక్కణాచార్య జయంతి సభను నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పురాతన కాలంలో మన కళావైభవానికి అత్యంత ప్రాముఖ్యత ఉండేదని అదే సంస్కృతిని ఇప్పటికి కొనసాగించడం అవసరమన్నారు. విశ్వకర్మ సమాజానికి కళలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ఆ దిశగా విశ్వకర్మ సమాజానికి చెందిన ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.



జక్కణాచార్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విశ్వకర్మ సమాజ పదాధికారులు

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

బళ్లారి జనవరి 1(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కర్ణాటక యునైటెడ్ అక్షర దాసోహ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సీఐటీయూసీ కార్యదర్శి ప్రభు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల పౌష్టికాహారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల బతుకు దుర్భరంగా ఉందని, ధరల పెరుగుదలతో వారికి ఇచ్చే జీతం చాలా తక్కువ అన్నారు. అదికూడా సమయానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బళ్లారి తాలూకాలో మధ్యాహ్న భోజన కార్మికులకు 2024 అక్టోబరు, నవంబరు, డిసెంబరు వేతనాలు ఇంకా రాలేదన్నారు. ఇతర తాలూకాల్లో నవంబరు జీతం ఇంకా రాలేదని అన్నారు. గత వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు 2 నెలలు పనిచేశారని గుర్తు చేశారు. అంతేకాక పాఠశాలల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలన్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై పలుమార్లు వినతులు అందజేసినా సమావేశం నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో సంస్థ తాలూకా అధ్యక్షురాలు మంజుళ, కార్యదర్శి నాగరత్న, కౌన్సిలర్ నాగరత్న పాల్గొన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్పకు వినతి పత్రం అందజేశారు.



సీఈఓ రాహుల్ శరణప్పకు వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘం నేతలు



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న రవి చెళ్లగుర్కి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నూతన సంవత్సరానికి స్వాగతం

బళ్లారి సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): దేశానికి విశేష కృషి చేసిన రాజులు, సంఘ సంస్కర్తలు, జాతీయ నాయకులు, మాజీముఖ్యమంత్రుల చిత్రపటాలకు పూజలు చేసి 2025కొత్తసంవత్సరానికి స్వాగతం పలకడం విశేషమని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి ఆన్నారు. బుధవారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన స్వాగత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజారామ్‌మోహన్ రాయ్ సతీసహగమన వ్యవస్థ నిర్మూలన, మహిళా సాధికారత, విద్య, స్వాలంబన కోసం ఎంతో కృషి చేశారన్నారు. తల్లిదండ్రులు బాలకల విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, అంబేడ్కర్ ఇచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యా సమన్వయకర్త మంగళ, హలకుంది క్లస్టర్ సీఆర్‌పీ శ్రీనివాస్‌రెడ్డి, చరకుంటే హెడ్‌మాస్టర్ ఓబులేసప్ప, నాగప్ప, ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతివ, శ్వేత, ఉమ్మేహాని, రామాంజినేయ, గురుప్రసాద్, విజయముంద్రగి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అధికారులకు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

బళ్లారిరూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలో నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణిలకు పలువురు అభినందనలు తెలిపారు. కందుకూరు రాముడు మాట్లాడుతూ డిసెంబరు31న కలెక్టర్, ఎస్పీలు లా అండ్ ఆర్డర్ చేయడం వల్ల నగరంలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా నూతన సంవత్సర వేడుకల ప్రశాంతంగా ముగిశాయన్నారు. బైకు ర్యాలీలు, బాణసంచా నగరవీధుల్లో ఎక్కడపడితే అక్కడ టపాసులు కాల్చకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ కుందాపుర, నాగరాజు, ఇషాక్, వెంకటేష్, మల్లికార్జున, భీమన్న, గిరీష్ గౌడ పాల్గొన్నారు.

సిరుగుప్ప: కోలాహలంగా న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా అన్ని చోట్లా ప్రజలు మధ్యరాత్రి నుంచి వేడుకలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి పంచుకున్నారు. యువతీయువకులు న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ చిందులు వేశారు. యేడాది పాటు పుష్కలంగా వర్షాలు, సమృద్ధిగా పంటలు, ప్రజలందరూ ఆరోగ్యంతో వుంటూ సుఖశాంతులతో జీవించాలని భగవంతున్ని ప్రార్థించారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్పకు పలువురు నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దేవాలయ భూములను ఇతర శాఖలకు కేటాయించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కంప్లి, జనవరి 1(ఆంధ్ర జ్యోతి): తాలుకాలోని కొత్తల ఆంజనేయస్వామి దేవస్థానం భూములను ఇతర శాఖలకు అప్పగించరాదని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బంగారు హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రేణుకమ్మకు మనవిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములు వున్నాయి. వాటిని ఇక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మరో శాఖకు అప్పగించాలని చూస్తున్నారని అలా చేస్తే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, తిమ్మప్ప, విరుపాక్షి పాల్గొన్నారు.

కలవరపెడుతున్న మాతాశిశు మరణాలు

రాయచూరు జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బాలింతల మరణాలు కలవరపెడుతున్నాయి. రాయచూరు జిల్లా కేంద్రంలోనే ఇలాంటి సంఘటన జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. దేవదుర్గ తాలూకా మసీదిపురానికి చెందిన శివలింగమ్మ(21) గత నెల 27వ తేదీన పురిటినొప్పులతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు ఆమె ప్రసవం ఇబ్బందిగా ఉండడంతో మాన్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి రెండు రోజులుగా అస్వస్థతకు గురై ఫిట్స్ బారిన పడింది. మరుసటి రోజే బిడ్డ మృతి చెందగా రెండు రోజుల అనంతరం(బుధవారం) తల్లి మృత్యువాత పడింది. దీంతో ఇటు వైద్యులు అటు అధికార యంత్రాంగం ఆందోళనకు గురయ్యారు. కాగా రక్తహీనతతో ఉన్న మహిళకు స్వయంగా డాక్టర్లే రక్తం ఇచ్చి మెరుగైన చికిత్స చేసినా బతికించే ప్రయత్నం చేసినా విఫలం కావడం అటు డాక్టర్లను ఆందోళనకు గురి చేసింది. ఇటీవల ప్రసవానికొచ్చే మహిళలకు వినియోగిస్తున్న మందులను రిమ్స్ ఆస్పత్రి ఆదేశాల మేరకు బదిలీ చేసిన అధికారులు మరణం ఎందుకు సంభవించింది. ఎలా సంభవించిందన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు.

హోసూరు జోన్

చర్చిలలో విశేష ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హోసూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని మత్తిగిరి శతాబ్దాల నాటి సంప్రదాయ పవిత్ర మాత ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత్తిగిరిలో ఉన్న వందేళ్ల నాటి ఆలయం ఆరోగ్యమాత ఆలయం చర్చ్‌లో ఆరోగ్యంకోసం, తమ తమ కష్టాల కోసం క్రైస్తవులు ప్రార్థనలు చేస్తూ ఉంటారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే బుదవారం వేకువజాము వరకు క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో మత్తిగిరిలోని హోలి మదర్ ఆఫ్ గాడ్ చర్చిలో ఫాదర్ క్రిస్టోఫర్ పాల్గొని బైబిల్‌లోని సూక్తులను పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరం అందరికి కేక్ కట్ చేసి అందించారు. అదే విధంగా మత్తిగిరి నేతాజీ రోడ్డులోని మాతా చర్చిలో ప్రార్థనలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హోసూరు జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరియార్ నగర్‌లో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి వెండి కవచం అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. హోసూరు తేరుపేట పార్వతినగర్‌లో ప్రసిద్ధిచెందిన చంద్రచూడేశ్వర ఆలయం, పెరియార్ నగర్ సుబ్రహ్మణ్యస్వామి, రాంనగర్ కోటమారియమ్మ, కృష్ణగిరి రోడ్డు శ్రీ బండాంజనేయ స్వామి ఆలయంల్లో, నేతాజీ రోడ్డులోని రామాలయం, కామనదొడ్డి వెంకటాచలపతి దేవాలయాలలో తెల్లవారు జామునుంచి విశేష పూజలు, అలంకరణలు చేశారు. తెల్లవారుజామునుంచే ప్రజలు అన్ని దేవాలయాల్లోను క్యూకట్టారు.



రజత కవచ అలంకరణలో పెరియార్ నగర్ సుబ్రహ్మణ్యస్వామి

ఏనుగు తిరుగుతోంది.. జాగ్రత్త..!

- అటవీ శాఖాధికారుల హెచ్చరిక

హోసూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కెలమంగలం లోని గ్రామీణ ప్రాంతాల్లో కొన్నిరోజులుగా ఒంటరి ఏనుగు సంచరిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తోంది. అడవులనుంచి గ్రామాలకు వస్తున్న ఏనుగులను అటవీ శాఖ అధికారులు తిప్పి పంపుతున్నా తరచూ మళ్లీ పంట పొలాలవైపు వస్తున్నాయి. కొన్నిచోట్ల పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం ఒంటరి ఏనుగు కెలమంగలం, డెంకణీకోట, శూలగిరి నుంచి ఉద్దనపల్లి మార్గంలో సంచరించింది. ఇలా ఏనుగు సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



రోడ్డు దాటుతున్న ఒంటరి ఏనుగు

రాజగణపతి నగర్‌లో వేరుశనగ పరుష

హోసూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సరంలో దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ హోసూరులో వేరుశనగకాయల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా 67వ వార్షిక పరుషలో భక్తులు ఆంజనేయస్వామికి వేరుశనగకాయలు సమర్పిస్తారు. హోసూరు రాజగణపతి నగరలోని ప్రసిద్ధి చెందిన రాజగణపతి వరసిద్ధి ఆంజనేయ ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. మూలవిరాట్టుకు వేరుశనగకాయలు సమర్పించారు. కార్పొరేషన్ ప్రజారోగ్య కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్ మాట్లాడుతూ తమిళనాడులో వేరెక్కడ కూడా ఇలా వేరుశనగకాయల ఉత్సవం జరగడంలేదని అభిప్రాయపడ్డారు. స్థానికంగా వ్యవసాయం అభివృద్ధి చెందాలని కోరుతూ స్వామి వారికి ఇలా పూజలు చేస్తారన్నారు. పరుషలో కృష్ణమూర్తి, రవిశంకర్, సురేశ్, రాము, శ్రీనివాసులు, చంద్రన్, గోవిందరాజ్, వెంటటేశ్, శశి, రఘు, కార్తీక్, తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



భక్తులకు వేరుశనగకాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

కేఎం మాథ్యూ (జయంతి)




'పద్మభూషణ్' గ్రహీత కంద మాథిల్ మమ్మెన్ (కేఎం) మాథ్యూ 1917 జనవరి 2న కొట్టాయంలో జన్మించారు. 'మళయాళ మనోరమ' దినపత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించారు. పలు భాషలలో పాఠకుల విజ్ఞానాన్ని, పఠనాసక్తిని పెంపొందించే 'మనోరమ ఇయర్ బుక్' ఎంతో పేరొం దింది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ), ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) ఛైర్మన్‌గా వ్యవ హరించారు. నేషనల్ సిటిజన్స్ అవార్డ్ పలు పురస్కా రాలు అందుకున్నారు. 2010 ఆగస్టు 1న కన్నుమూశారు.

డైసకు ఇకెడా (జయంతి)



డైసకు ఇకెడా 1928 జనవరి 2న జపాన్‌దేశం టోక్యోలో జన్మించారు. బుద్ధ తత్వవేత్త, విద్యావేత్త, రచయిత. సోకా గక్కై ఇంటర్నేషనల్ (ఎస్‌జిఐ) మూడవ అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రపంచవ్యాప్తంగా 192 దేశాలలో బుద్ధిస్టులు ఎస్‌జిఐలో సభ్యులుగా ఉన్నారు. ఐక్యరాజ్యసమితిచే 'యునైటెడ్ నేషన్స్ పీస్ మెడల్', దేశం తరపున 'ఠాగూర్ పీస్ అవార్డు' ఇతర పురస్కారాలు పొందారు. 2023 నవంబరు 15న కన్నుమూశారు.

ఆదిభట్ల నారాయణ దాసు (వర్ధంతి)



సంగీత, సాహిత్య మేళవింపుతో హరికథా ప్రక్రియను సృజించి 'హరికథా పితామహ'గా పేరొందిన అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న జన్మించారు. సంస్కృతాంధ్రాలలో పలు రచనలు చేసిన రచయిత, కవి, బహుభాషా కోవిదుడు, తాత్వికుడు. తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఆంగ్లం, అరబిక్, పార్సీ భాషాలలో ప్రావీణ్యం పొంది అష్టావధానాలు చేశారు. విజయనగరం మహారాజు స్థాపించిన విజయరామ గాన పాఠశాలకు తొలి ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించారు. 1945 జనవరి 2న కన్నుమూశారు.

పిలకా గణపతి శాస్త్రి (వర్ధంతి)



పిలకా గణపతి శాస్త్రి 1911 ఫిబ్రవరి 24న తూర్పు గోదావరి జిల్లా కట్టుంగ గ్రామంలో జన్మించారు. కవి, వ్యాఖ్యాత, నవలా రచయిత, అనువాదకుడు, ఆర్ష విద్వాంసుడు, పత్రికా సంపాదకుడు. విజయనగరం సంస్కృత కళాశాలలో సాహితీ విద్యాప్రవీణ పట్టా పొందారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. 1983 జనవరి 2న కన్నుమూశారు.

చంద్రశేఖర కంబార (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత చంద్రశేఖర కంబార 1937 జనవరి 2న కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలో జన్మించారు. కన్నడ సాహిత్యంలో తనదైన గుర్తింపుతో జ్ఞానపీఠ పురస్కారం పొందారు. హంపిలోని కన్నడ యూనివర్శిటీకి ఫౌండర్ వైస్ ఛాన్సెలర్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. రచయిత, సినీ దర్శకుడు కూడా. ప్రత్యేకించి ఉత్తరకర్ణాటక శైలిలో రచనలు, పద్యాలు ఉంటాయి. కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. జ్ఞానపీఠ, పద్మశ్రీ పురస్కారాలతోపాటు కబీర్ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, పంప అవార్డులు పొందారు.

డాక్టర్ పరకాల ప్రభాకర్ (పుట్టినరోజు)



ప్రముఖ పొలిటికల్ ఎకనామిస్ట్ పరకాల ప్రభాకర్ 1959 జనవరి 2న నరసాపూర్‌లో జన్మించారు. విమర్శకులు, ఆర్థిక, సామాజిక అంశాలపై పట్టు కలిగినవారు. లండన్ స్కూల్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. 2014-18 మధ్యన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కలిగిన కమ్యూనికేషన్స్ అడ్వైజర్‌గా పనిచేశారు. ప్రజారాజ్యం పార్టీ ప్రతి నిధిగాను, బీజేపీ ప్రతినిధిగాను వ్యవహరించారు. కాగా ఆయన సతీమణి నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నారు.

సంజితా చాను (పుట్టినరోజు)



సంజితాచాను ఖుముచ్చమ్ 1994 జనవరి 2న మణిపూర్‌లో జన్మించారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి. దేశం నుంచి రెండుసార్లు కామన్ వెల్త్ గేమ్స్ ఛాంపియన్ షిప్‌లో పోటీ చేశారు. 2014లో గ్లాస్గో బంగారుపతకం, 2018 గోల్డ్‌కోస్ట్‌లలో 48కేజీల, 53 కేజీల విభాగంలో సత్తా చాటుకున్నారు. 84కిలోల విభాగంలో స్నాచ్ సెగ్మెంట్‌లోనూ రికార్డు నెలకొల్పారు.

కిటకిటలాడిన ఆలయాలు



బనశంకరి అమ్మవారికి పూజలు



బుల్ టెంపుల్‌లో క్యూ



దొడ్డగణేశ్‌కు పూజలు

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం ప్రారంభం రోజున ఆలయాలు కిట కిటలాడాయి. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను సందర్శించేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ధర్మస్థళ, కుక్కె సుబ్రమణ్య, మలెమహదేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బెంగళూరులోని వయ్యాలికావల్ టీటీడీ ఆలయంలో తెల్లవారుజామునుంచే భక్తుల రాక ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే అశ్వత్థ నారాయణ, ఆర్‌ఆర్‌నగర్ ఎమ్మెల్యే మునిరత్నలు దర్శనం చేసుకున్నారు. భక్తులకోసం ప్రసాదం పంపిణీ చేశారు. టీటీడీకి సంబంధించిన డెయిరీలు, క్యాలెండర్‌లు విక్ర యించారు. బనశంకరి, బసవనగుడి దొడ్డ బస వణ్ణ, దొడ్డగణేశ, గవిగంగాధరేశ్వర, మల్లేశ్వరం లోని కాడు మల్లేశ్వర ఆలయం, జేపీ నగర్ తిరు మలగిరి ఆలయం తదితర ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. ఇతర ఆలయాలలోనూ భక్తుల సందడి నెలకొంది.



కన్నడ వచనసాహిత్యం జీవితానికి స్ఫూర్తి

● శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సోమశేఖర్

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పన్నెండో శతాబ్దంనాటి కన్నడ వచన సాహిత్యం విశ్వసాహిత్యంలోనే గుర్తింపు పొందిందని అన్ని కాలాలకు అన్వయించేలా ఉండి జీవితాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అఖిలభారత శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీ సోమశేనా అన్నారు. రంగసంస్థాన సంస్థ శేషాద్రిపురం విద్యాసంస్థ సహకారంతో శతకంఠ వచనగాయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి యవత సరైన మార్గదర్శకంలో సాగేందుకు ఉజ్వల భవిష్యత్తుకు కాయకరత్న బసవణ్ణ, మహాదేవి అక్క, అల్లమప్రభు, అంబిగెర చౌడయ్య ఇలా వందలాదిమంది శివవరణలు కన్నడ సాహిత్యానికి అపార సేవలందించారన్నారు. మాట, రచన ఒకేలా ఉండేలా చెప్పినమాటకు కట్టుబడి ముందుకు సాగేలా సాహిత్యం ఉందన్నారు. బండ్లహళ్ళి విజయ్‌కుమార్ కన్నడ సంస్కృతిని జాగృతం చేసేలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సుమంగలి సేవాశ్రమ అధ్యక్షురాలు కర్ణాటక మదర్‌థెరెసాగా పేరొందిన డాక్టర్ ఎస్‌జి సుశీలమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మన మనస్సు ఉల్లాసం, సంతోషంగా ఉంటే శతకంఠ గాయనమే కాదు వేల, కోటి కంఠ గాయనం కూడా సాధ్యం చేయవచ్చునన్నారు. కర్ణాటక గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు నాడోజ డాక్టర్ ఊడే పి కృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. రంగసంస్థాన సంస్థ కార్యవైఖరి సహకారంతో మంచి కార్యక్రమాలు నిర్వహించిన శేషాద్రిపురం పీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్‌వి మంజునాథ్, ప్రొఫెసర్ జీకే మంజునాథ్‌లను ప్రశంసించారు. విద్యార్థుల శతకంఠ వచనగాయన కార్యక్రమం ఆకట్టుకుంది. జానపద గాయకుడు డాక్టర్ బండ్లహళ్ళి విజయ్‌కుమార్, బసవ అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ మధు, కన్నడ లెక్చరర్ డాక్టర్ హెచ్ కావ్యశ్రీ పాల్గొన్నారు.



శతకంఠ వచనగానంలో విద్యార్థులు

శాంతిధామలో నూతన సంవత్సర వేడుకలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు పదాధికారులు, భక్తులు

బొమ్మనహళ్ళి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలో బుధవారం వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామునుంచే సంతోషిమాతా, మంజునాథస్వామి, షిర్డీసాయిబాబాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాబా ఆలయంలో భక్తులచే 7నుంచి8.30వరకు భక్తులచే జలాభిషేకం చేసేందుకు అవకాశం కల్పించారు. అనంతరం రమ్యా ప్రింటర్స్ అధినేత రామిరెడ్డి, పార్వతమ్మల కుమారుడు నరేంద్ర కుటుంబీకులతో కలసి షిర్డీ సాయిబాబా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భక్తులకు 9వేల క్యాలెండర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఏటా బాబా భక్తులకోసం తనవంతుగా క్యాలెండర్లను సమకూరుస్తున్నట్టు నరేంద్ర తెలిపారు. ఆలయ ట్రస్టు తరపున నరేంద్ర కుటుంబీకులకు జ్ఞాపికలు అందచేసి ఘనంగా సత్కరించారు. ఆలయ ట్రస్టు కొనసాగిస్తున్న సామాజిక సేవలకు తాము భక్తులుగా మారామన్నారు. ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ మాట్లాడుతూ బాబా కృపతోనే సామాజిక, ధార్మిక కార్యక్రమాలు సాధ్యమవుతోందన్నారు. స్వామివారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కాగా గోశాల నిర్వహణకోసం భక్తురాలు లక్ష్మీ విజయకుమార్‌లు రూ.3.50లు విరాళం అందచేసినట్టు ప్రకటించారు. తీర్థప్రసాదాల పంపిణీ అనంతరం మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం భక్తి కచేరీ కొనసాగింది. సురేశ్, శ్రీనివాస్‌రావ్‌లు పాటలను ఆలపించారు. రాత్రి మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో క్యాండోర్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత నరేశ్‌రెడ్డి, కుటుంబీకులు, ఆలయ ట్రస్టు పదాధికారులు ముకేశ్‌కుమార్ వర్మ, ప్రకాశ్ నర్వాణి, కార్యదర్శి తాతయ్యగుప్త, మనోహరగుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



షిర్డీసాయిబాబాకు విశేష అలంకరణ

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ

బాగేపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలోని ప్రభుత్వ హైస్కూల్ 17వ వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు జీ రామసుబ్బమ్మ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఘంటంవారిపల్లిలో 2008లో ప్రభుత్వ హైస్కూల్ ప్రారంభమైన తర్వాత గ్రామీణ పేద విద్యార్థులకు ఎంతో అండగా నిలిచిందన్నారు. ఇక్కడ చదివినవారు ఎంతో ఉన్నతస్థానాలలో ఉన్నారని, ఉత్తమఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఇదే సందర్భంగా వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ టీచర్ ఎస్‌ఎన్ సంధ్యా, కేబీ ఆంజనేయరెడ్డి, నారాయణస్వామి, సీఎల్ రవి, ఎస్ వరలక్ష్మి, ఎస్‌జివి చంద్రశేఖర, ఉషా, గీతశ్రీ, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు బ్యాండ్‌సెట్ వితరణ



బ్యాండ్‌సెట్ అందజేస్తున్న నారాయణస్వామి తదితరులు

శిడ్లఘట్ట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ద్యావప్పనగుడి ప్రభుత్వ హైస్కూల్‌లో నూతన సంవత్సరం ప్రారంభం రోజున క్రీడాకారుడు నారాయణస్వామి రూ.25వేల విలువైన బ్యాండ్‌సెట్‌ను ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పాఠ్యేతర అంశాలలోనూ చురుగ్గా రాణించేలా బ్యాండ్‌సెట్ సమకూర్చాలని వ్యాయామ టీచర్ మంజుళ వినతిమేరకు అందచేశామన్నారు. పాఠశాలకు సమీపంలోని గొరమిల్లహళ్ళి, కోటహళ్ళి, బైరగానహళ్ళి, మల్లహళ్ళి, అబ్లూడు, దూరద హనుమంతపుర, చిక్కబళ్ళాపుర తాలూకా బదగానహళ్ళి తదితర ప్రాంతాల విద్యార్థులు వస్తున్నారన్నారు. 6 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చేవారికి బస్సు సదుపాయం లేదని తెలిసిందని వారికి సైకిళ్లను ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. మూడేళ్లుగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రక్రియను పునరుద్ధరించాలని కోరారు. ఇదే సందర్భంగా విద్యార్థులకు ట్రాక్‌సూట్ అందచేశారు. విద్యార్థులు అన్నిరంగాలలో రాణించేలా తమవంతు ప్రోత్సాహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిచంద్రమౌళి, వ్యాయామ టీచర్ సీకే మంజుళ, వేణు, శైలా, గాయత్రి, యశోద తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి బ్రాహ్మణ సమ్మేళనం

శిడ్లఘట్ట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ 50వ వార్షిక సంబరం, రాష్ట్రస్థాయి 11వ బ్రాహ్మణ సమ్మేళనం బెంగళూరులో ఈనెల 18, 19తేదీలలో రెండు రోజులపాటు జరగనుంది. సమ్మేళనం తాలూకా ఆర్గనైజర్‌గా డీవీ భాస్కర్ నియమితులయ్యారు. పట్టణంలో బుధవారం అఖిల బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు అశోక్ హారనహళ్ళి మాట్లాడుతూ తాలూకా నుంచి పెద్దసంఖ్యలో బ్రాహ్మణులను సమ్మేళనానికి వచ్చేలా విజయవంతం చేయాలని భాస్కర్‌కు సూచించారు.

తాగి గొడవకు వెళ్లి..!

హిందూపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాలనీ ఆటోస్టాండ్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గొడవపడ్డారు. శాంతినగర్‌కు చెందిన మహబూబ్ బాషా ఇంటికి వెళుతుండగా ఆటో స్టాండ్ వద్ద ఉన్న నూర్ మహ్మద్ అకారణంగా దాడిచేశాడు. దీంతో మహబూబ్ బాషా తన వద్ద ఉన్న కత్తితో నూర్ మహ్మద్‌ను ప్రతిదాడి చేశాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో తీవ్రంగా గాయపడిన నూర్ మహ్మద్‌ను పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూర్ మహ్మద్ మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు తెలిపారు. వీరిద్దరి మధ్య గతంలో ఎలాంటి గొడవలు లేవని అన్నారు.

భీమా కోరెగావ్ విజయోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి

దొమ్మసంద్ర, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సర్జాపురలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో భీమా కోరేగావ్ విజయోత్సవం, క్యాలెండర్ విడుదల, బైక్ జాథా నిర్వహించారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వీకేసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంసీ హళ్ళివేణు మాట్లాడుతూ 200 సంవత్సరాలక్రితం కుల వ్యవస్థను ఖండిస్తూ స్వాభిమానం కోసం 500 మంది మహర్ యోధులు 28వేల పేష్వాల బలగాలను ఓడించిన సంకేతమే భీమా కోరేగావ్ అన్నారు. వీకేసీ బెంగళూరు నగర జిల్లా ఉపాధ్యక్షుడు వందేమాతరం మహేశ్, వీకేసీ పార్టీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి రాజ కుమార్, ఐసాక్ అమృతరాజ్ డీపీఐ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగమణి మౌర్య, శ్రీనాథ్ నాస్తిక్, పదాధి కారులు వీణాకుమారి, మురళి చౌద్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.